# ఎస్టీలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- రాబోయే ఐదేండ్లలో 5వేల మంది ఎస్టీ ఆంత్రప్రెన్యూర్స్ రావాలి
- వారితో మరో 50 వేల మందికి ఉపాధి దొరకాలి
- 'హర్లీస్' స్టార్టప్‌ను చూస్తుంటే గర్వంగా ఉంది
- సీఎంఎస్టీఈఐ సక్సెస్‌మీట్‌లో మంత్రి కేటీఆర్
- కేసీఆర్‌కు రుణపడి ఉంటాం: సత్యవతి
- ఎస్టీలను కోటీశ్వరులను చేయాలన్నదే సీఎం లక్ష్యం: సోమేశ్‌కుమార్



సీఎంఎస్టీఈఐ సక్సెస్ మీట్‌లో 'తెలంగాణ గిరిజన సంక్షేమం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు కేటీఆర్, సత్యవతి, ప్రభుత్వ సలహాదారు సోమేశ్‌కుమార్, గిరిజన పారిశ్రామికవేత్తలు తదితరులు

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): సీఎం కేసీఆర్ తెలంగాణలో తిరుగులేని పారిశ్రామిక సమాజాన్ని నిర్మించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు తెలిపారు. ప్రభుత్వ ఆర్థిక సహకారంతో ఎంతో మంది ఎస్సీ, ఎస్టీలు పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారని సంతోషం వ్యక్తంచేశారు. రాబోయే ఐదేండ్లలో ఎస్టీ సామాజికవర్గం నుంచి ఐదు వేలకుపైగా ఆంత్రప్రెన్యూర్స్ మార్కెట్‌లో నిలదొక్కుకోవాలని, అందుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. ఆ ఐదు వేల మంది ద్వారా మరో 50 వేలమందికి ఉపాధి కల్పించాలని ఆకాంక్షించారు. గురువారం హైదరాబాద్‌లోని పార్క్‌హయత్‌లో 'చీఫ్ మినిస్టర్ షెడ్యూల్డ్‌ట్రైబ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్ స్కీమ్' (సీఎంఎస్టీఈఐ) ద్వారా లబ్ధిపొందిన సుమారు 500 మంది పారిశ్రామికవేత్తలు సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. తెలివి ఒకరిసొత్తు కాదని, జీవితంలో ఎన్ని అవరోధాలు ఎదురైనా ఎదురొడ్డి నిలబడాలని, ప్రతిక్షణం తెలివితో ఆలోచించి ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. కులమతాలకు అతీతంగా పారిశ్రామికవేత్తలు బయటికి రావాల్సిన ఆవశ్యకత ఉన్నదని చెప్పారు. చింతమడక గ్రామంలో సింగిల్ విండో చైర్మన్ పదవికి పోటీ చేసి ఓటమి పాలైన సీఎం కేసీఆర్ రాజకీయ ప్రస్థానాన్ని మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా వివరించారు. ఆ తర్వాత ఎమ్మెల్యేగా పోటీ చేసిన కేసీఆర్.. 750 ఓట్ల తేడాతో ఓటమి పాలైనా పట్టువదలని విక్రమార్కుడిలా రాజకీయాలను అవపోసనపట్టి, ముఖ్యమంత్రిగా ఎదిగిన తీరును వివరించారు. సీఎం కేసీఆర్ తండ్రి ముంబైలో షాపూర్జీ పల్లోంజి కంపెనీలో సబ్ కాంట్రాక్టర్‌గా పనిచేసి విజయం సాధించారని చెప్పారు. జీవితంలో ఎన్ని ఎదురుదెబ్బలు తగిలినా వెనకడుగు వెయ్యొద్దని, అందరిలోనూ సమానమైన తెలివితేటలు ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకొని విజయం సాధించాలని ఉద్బోధించారు. సీఎంఎస్టీఈఐ ద్వారా లబ్ధిపొందిన స్టార్టప్ కంపెనీ 'హర్లీస్' అంతర్జాతీయ ఖ్యాతి సంపాదించిందని కొనియాడారు. హరిలాల్, లీల పేర్ల నుంచి 'హర్లీస్' స్టార్టప్‌ను తెలివిగా తీర్చిదిద్దారని సురేశ్‌నాయక్, లక్ష్మి దంపతులను అభినందించారు.

### రాష్ట్రంలో తిరుగులేని పారిశ్రామిక సమాజం

సీఎం కేసీఆర్ ఆలోచన మేరకు 2018లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఎంఎస్టీఈఐ పథకం ద్వారా 500 మంది పారిశ్రామికవేత్తలు వివిధ రంగాల్లో తమ ప్రతిభచూపడం ఆనందంగా ఉన్నదని మంత్రి కేటీఆర్ చెప్పారు. విజయం సాధించిన వారు ప్రభుత్వ పెద్దలను పిలిచి ఓ ఫైవ్‌స్టార్ హోటల్‌లో సక్సెస్‌మీట్ పెట్టి, తమ కృతజ్ఞత చూపించడం గొప్ప విషయమని అన్నారు. దళితబంధుతో ఎందరో దళిత యువకులు పారిశ్రామికవేత్తలుగా అవతరించారని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక భరోసాతో నెలకు రూ.60-70 వేలు సంపాదిస్తున్నారని, అదేస్థాయిలో ఎస్టీ యువత పయనించాలని ఆకాంక్షించారు. 2040 నాటికి ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా ఇండియా అవతరించనున్నదని చెప్పారు.

## 65 ఏండ్లు ఒక ఎత్తు.. ఈ పదేండ్లు మరో ఎత్తు

స్వతంత్ర భారతంలో తెలంగాణకు సంబంధించి 65 ఏండ్లు ఒక లెక్క.. బీఆర్ఎస్ పాలనలో ఈ పదేండ్లు మరో లెక్క అని మంత్రి సత్యవతి రాథోడ్ చెప్పారు. సమాజంలో అణగారిన అన్ని వర్గాలకు సీఎం కేసీఆర్ ఆర్థిక చేయూతనందించడం గొప్ప విషయమని కొనియాడారు. సీఎం కేసీఆర్ తండాలను పంచాయతీగా చేశారని, గిరిజనులకు రిజర్వేషన్లు ఇచ్చారని, మెడికల్ కాలేజీల్లో సీట్లు ఇచ్చారని, ఎస్టీ గురుకులాలను అప్‌గ్రేడ్ చేయడం వంటి ఎన్నో పనులు చేశారని వివరించారు. సీఎం కేసీఆర్‌కు గిరిజన సమాజం రుణపడి ఉంటుందని, ఆయనకు కృతజ్ఞత చెప్పే సమయం ఆసన్నమైందని అన్నారు. ప్రభుత్వ సలహాదారు సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాలను, గిరిజన బిడ్డలను కోటీశ్వరులుగా చేయాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పమని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆలోచనల నుంచి పుట్టిందే సీఎంఎస్టీఈఐ పథకమని, ముఖ్యమంత్రి సూచన మేరకు తానే డ్రాఫ్ట్ తయారు చేశానని వెల్లడించారు. రానున్న ఐదేండ్లలో వీరంతా రూ.2 వేల కోట్ల మార్కెట్‌ను చేరతారన్న ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాంనాయక్, ప్రముఖ పారిశ్రామికవేత్త సురేశ్‌నాయక్ దంపతులు, పలువురు ఎస్టీ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# శ్రీహరికోటకు 'స్కైరూట్' రాకెట్

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): టీ హబ్ కేంద్రంగా మొదలైన 'స్కైరూట్' సొంతంగా రాకెట్ ప్రయోగాలను సంబంధించిన యంత్ర పరికరాలను రూపొందిస్తున్నది. తాజాగా విక్రమ్-1 పేరుతో ప్రయోగించే రాకెట్ కోసం యంత్ర భాగాలను నగరంలోని తమ పరిశోధన కేంద్రంలో ప్రయోగానికి సిద్ధం చేసింది. ఈ మేరకు నగరంలో 10 మీటర్ల పొడవుతో రూపొందించిన మొదటి దశ కంపోజిట్ మోటార్ (కలామ్ 1200)ను శ్రీహరికోటకు తరలించింది. ఇప్పటికే కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ విక్రమ్-1 రాకెట్ లాంచ్ వెహికిల్‌ను పరిశీలించి వెళ్లారు. అదేవిధంగా నాలుగు రోజుల కిత్రమే సుమారు రూ.225 కోట్ల నిధులు స్కైరూట్‌కు సమకూరాయి. హైదరాబాద్ కేంద్రంగా ఏరోస్పేస్ స్టార్టప్‌గా సేవలను ప్రారంభించిన స్కైరూట్ అటు ప్రయోగాలు చేయడంలోనూ కొత్తగా నిధుల సమీకరణలోనూ సత్తా చాటుతున్నది.



మొదటి దశ కంపోజిట్ మోటార్‌ను వాహనంపై శ్రీహరికోటకు తరలిస్తున్న నిర్వాహకులు






# సీపీఎస్ విధానం రద్దు చేయాలి

- నేడు ఢిల్లీలో ఏఐఎస్‌జీఈఎఫ్ ర్యాలీ
- టీఎన్జీవో కేంద్ర సంఘం మద్దతు

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య(ఏఐఎస్‌జీఈఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో 'చేతన్ ర్యాలీ' నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు గురువారం హైదరాబాద్ నుంచి టీఎన్జీవో కేంద్ర సంఘానికి చెందిన 50 మంది ప్రతినిధులు ఢిల్లీకి బయలుదేరివెళ్లారు. ఇన్‌కమ్ టాక్స్ పరిమితి పెంపు, కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు వంటి తదితర డిమాండ్లతో ఈ ర్యాలీ చేపట్టనున్నట్టు టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధానకార్యదర్శి మారం జగదీశ్వర్ తెలిపారు. కేంద్రంలోని మోదీ సర్కార్ ఉద్యోగులకు వ్యతిరేకంగా పనిచేస్తుందని మండిపడ్డారు. ఢిల్లీ వెళ్లిన వారిలో వివిధ జిల్లాల టీఎన్జీవో బాధ్యులు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణగౌడ్, ఆర్ శ్రీనివాసరావు, లక్ష్మణ్, ముజీబ్ హుస్సేనీ, అలుక కిషన్, నరేందర్, ఆకుల రాజేందర్, సోమన్న, నరసింహరెడ్డి, కొండల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, పర్వతాలు తదితరులు ఉన్నారు.

## బాబుపై సీఐడీ మరోకేసు

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుకు సీఐడీ మరో షాకిచ్చింది. తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు సంబంధించిన కేసులో చంద్రబాబును సీఐడీ ఏ2గా చేర్చింది. ఏపీఎండీసీ ఇచ్చిన ఫిర్యాదుతో సీఐడీ అధికారులు ఈ కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ1గా మాజీ మంత్రి పీతల సుజాత, ఏ3గా దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏ4గా మాజీ మంత్రి దేవినేని ఉమ ఉన్నారు. ప్రభుత్వ ఖజానాకు తీవ్ర నష్టం కలిగించారన్న ఆరోపణపై ఈ కేసు నమోదు చేసినట్టు సీఐడీ పేర్కొంది. ఇప్పటికే చంద్రబాబుపై అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్, స్కిల్ డెవలప్‌మెంట్, అసైన్డ్ ల్యాండ్స్, ఫైబర్‌నెట్ కేసులు విచారణలో ఉన్నాయి. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబు ఆరోగ్య కారణాలపై బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే. ఆయన గురువారం హైదరాబాద్‌లోని ఏఐజీ దవాఖానలో చికిత్స కోసం చేరారు.

## వేద విద్వన్మహాసభలు ప్రారంభం

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : పెద్దపల్లి జిల్లా మంథనిలో శ్రీసీతారామ సేవా సదన్, జనార్దనానంద స్వామి సేవా ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో 23వ తెలంగాణ వేద విద్వన్మహాసభలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఈ నెల 5 వరకు 23వ వార్షిక విద్వత్సమావేశాలు, వేద పరీక్షలు నిర్వహించనున్నారు. సుమారు 500 మంది వేద విద్యార్థులకు నాలుగు వేదాల్లో పరీక్షలుంటాయి. సభల్లో భాగంగా వేద మాత అనుగ్రహప్రాప్తి కోసం శుక్ల యజుర్వేదం హవనము నిర్వహిస్తున్నామని, ఇందులో 1,000 మంది వివిధ ప్రాంతాలవారు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. వేదవిద్యను జనాలకు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

## డీసీఏను సందర్శించిన యూఎస్ ఎఫ్‌డీఏ అధికారులు

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) భవనాన్ని అమెరికాకు చెందిన ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ (యూఎస్ ఎఫ్‌డీఏ) అధికారులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా డీసీఏ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి తెలంగాణ ప్రభుత్వం ఇటీవల తీసుకొన్న పలు నిర్ణయాలను ఎఫ్‌డీఏ అధికారులకు వివరించారు. రిస్క్ బేస్డ్ శాంప్లింగ్, ప్రొఫైలిన్ గ్లైకాల్ పరీక్షలకు సంబంధించిన పరిశ్రమ, విజిలెన్స్ సెల్, తనిఖీల విధానం వంటి అంశాలపై చర్చించారు. 'యూఎస్ ఎఫ్‌డీఏ - టీఎస్ డీసీఏ రెగ్యులేటరీ ఫోరం' కోసం పలు ప్రతిపాదనలు చేశారు.


